
చిన్నకథ

# సతీవ్రతుడు

**పి.ఎస్. నారాయణ**

“నువ్వు పువ్వు నవ్వు జవ్వని నాసిక
చివురు సవురు జవురు నువిదమోవి
మబ్బు నుబ్బు గెబ్బు బిబ్బోకవతి వేణి
మెరపు నొరపు బరపు తెరవమేను.

మా ఊళ్ళో మా పక్కింట్లో ఓ తెలుగు మాష్టారు వుండేవారు. ఆయన ఎప్పుడూ విజయవిలాసంలో చేమకూర వేంకటకవి రాసిన ఈ పద్యం చదువుతూ ఆనందిస్తుండేవాడు. ఎందుకోగాని ఈరోజు నిన్ను చూస్తుంటే ఆ పద్యమే పదేపదే గుర్తుకువస్తోంది. సుశీ!”



సుశీల భర్తను చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వింది.

చక్రధరం అప్పుడే భోజనం చేసి, చేయి కడుక్కునేటందుకు వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాడు. అతడు చేయి కడుక్కుని వచ్చేలోగా స్టీలుప్లేట్లో తమలపాకులు, వక్కపొడి, సున్నండబ్బా, నాలుగు లవంగాలు పెట్టుకుతెచ్చింది. శ్రావణమాసం అవ్వడంతో వాళ్ళూ వీళ్ళూ యిచ్చిన తమలపాకులన్నీ టేబుల్ మీద కవర్లలో పడి ఉన్నాయి.

''తాంబూలమేసుకోండి!''

''నువ్వు చుట్టి ఇస్తే దానికి రుచి ఎక్కువే!'' అన్నాడు వంకెన వున్న ప్యాంటు అందుకుంటూ, మురిపెంగా ఆమెనే చూస్తూ.

''ఈ దరిద్రపు గోలేమిటండీ. అంకమ్మ శివాల్లా అర్ధరాత్రిపూట ఆఫీసు...!'' అంది చికాగ్గా సుశీల. ''ఈమధ్య మరీనూ!''

''రేప్పొద్దుటికల్లా ఆ రిటరన్ పూర్తిచేసి హైద్రాబాద్‌లోని మా హెడ్డాఫీసుకు పంపకపోతే మా బాసుకు బీపీ పెరుగుతుంది. బీపీ పెరిగితే షుగరూ పెరుగుతుందనేది ఓ లాజిక్కు. ఆ రెండూ పెరిగితే ఈయన తిక్కవాగుడికి అంతుండదు. ఇంటికెళ్ళి ఒకసారి అలాగే వాగుతూంటే సతీమణిగారు చీపురుకట్ట తిరగేసిందట. వాళ్ళింట్లో ఇరవై నాలుగు గంటలూ పడుండే పనివాడు ఆఫీసులో అందరి చెవుల్లోనూ రహస్యంగా ఊదేశాడు. అంతా నీ అంత మంచివాళ్ళు వుండరు కదా. అందునా వచ్చే సంవత్సరం నాకు ప్రమోషన్ రావాలి. ఆయన భార్యకు ఎంత లోకువైనా, ఆఫీసులో బాసంటే బాసే. నేను ఆయన మాట వినయంగా వినక తప్పదు....మన అవసరం!''

''మీరు మరీను!'' అంది తమలపాకులకు సున్నం రాసి, వక్కపొడి పెట్టి, చుట్టచుట్టి లవంగం గుచ్చుతూ.

''నేను చెప్పేది నిజమోయ్. అంతదాకా ఎందుకు. క్రిందటి నెల్లో ఇలాగే ఆఫీసులో మా బాసు గొంతుమీద కత్తిపెట్టి ఆ స్టేట్‌మెంటేదో పూర్తి చేయాలంటే, నాతో పాటు నా అసిస్టెంట్ సుబ్రహ్మణ్యాన్ని కూర్చోబెట్టానా. ఆ రాత్రి వాడు ఇంటికి వెళ్ళేటప్పటికి మూడయింది నాకు లాగానే. అప్పుడు ఇంటి దగ్గర పెళ్ళాం తలుపు తీయకపోగా –'ఆఫీసుకంటూ వెళ్లారు. ఎక్కడెక్కడ తిరిగొస్తున్నారో మీ మగవాళ్ళను అసలు నమ్మడానికి వీల్లేదు. నేను తలుపు తీయను. వెళ్ళి ఊరిబయట కాలవలో మునిగి వళ్లు శుభ్రం చేసుకురండి. లేదా వాకిట్లో అరుగుమీద పడుకుని, తెల్లవారిం తరువాత సరాసరి దొడ్లోకి వెళ్లి బావి దగ్గర స్నానం చేయండి. అంతేగాని ఆ ఛండాలపు గుడ్డలతో లోపలకు రావడానికి వీల్లేదు' అన్నదిట. కలికాలం మరి!''

సుశీల నవ్వింది. ''కొయ్యండి! మా ఆడవాళ్ళు అంత దారుణంగా ఏం మాట్లాడరు!''

''నిజమేనే! ఒట్టు. కాగితాల మీద రాసి రాసి వెధవ ఇంకంతా చేతివేళ్లకు ఎలా అయిందో చూడూ అంటూ కాంపౌండ్ వాల్ మీద నుంచి ఎగిరెగిరి చూపించినా న మ్మితేనా. వాడు ఒకటే ఏడుపు. తెల్లవార్లూ చలిలో వాకిట్లో నల్లరాళ్లమీదే వణుక్కుంటూ పడుకోక తప్పలేదు. ఇక చచ్చినా దేవుడొచ్చి నైట్ డ్యూటీ చేయమన్నా చేయనన్నాడు''

సుశీల తమలపాకులు ఇస్తుంటే ''చేతికంటే నోటికందిస్తే దానికి సుగంధద్రవ్యాలు కలిపిన రుచి వస్తుందోయ్!'' అంటూ నోరు తెరిచాడు చక్రధరం.

''పిల్లలు ఇంకా నిద్రపోలేదు!'' అంది ముఖమంతా ఎర్రబడగా సుశీల.

''సరేలే.. వాళ్లను త్వరగా నిద్రపుచ్చు. నేను ఇట్టే ఆఫీసులో పని పూర్తిచేసుకుని పన్నెండింటికల్లా వచ్చేస్తాను కాని.. సుబ్రహ్మణ్యం భార్యలాగా నాకు అరుగే పందిరిమంచం చేయబోకు!'' అన్నాడు ఆమె ఇచ్చిన తమలపాకులు అందుకుని బుగ్గన పెట్టుకుంటూ, భార్య బుగ్గన చిటికేసి.

చొక్కా తొడుక్కున్నాడు. తల దువ్వుకున్నాడు. చొక్కాజేబులో, భార్యచేత టేబుల్ మీద ఉన్న పెన్ను తెప్పించుకుని మరీ పెట్టుకున్నాడు.

బయటకు రాబోతూ ''నేనొచ్చేటప్పటికి ఒక కునుకు తీసి ఫ్రెష్ అయి వుండు. ఇక మనకు తెల్లవార్లూ నిద్ర వుండదు. ఇవ్వాళ నైట్‌డ్యూటీ చేశాను కాబట్టి రేపు లేటుగా వెళ్లినా మా ముసుంకోడు ఏడ్చిచావడులే!''

''వాడెవడు మధ్యలో!'' అంది సుశీల.

''మా బాస్‌గాడేనే. ముసలి ముండా కొడుకు. మూడక్షరాలలో ముద్దుగా పిలుచుకుంటాం. రెండేళ్లలో రిటైరవ్వబోతున్నాడా. నాలాంటి కుర్రాళ్ళ చేత రాత్రిళ్ళు పనిచేయిస్తాడుగాని వాడు మాత్రం పెళ్లాన్ని వదిలిపెట్టి చచ్చినా బయటకు రాడు''

''మీరు కుర్రాళ్లా!...నాలుగేళ్లల్లో యాభై రాబోతున్నాయి''

''మనిషి జీవితం వందేళ్ళే. అందులో సగం దాటలేదూ అంటే కుర్రాడికిందే లెక్క!'' అన్నాడు ఓ ముద్దివ్వ అన్నట్టుగా ముందుకు వంగుతూ.

''తొందరగా పోండి. వెధవ గోల!'' అంటూ వెనక్కు తిరిగింది సుశీల.

''మా పక్కింటి తెలుగుపంతులు గారు చెప్పే వర్ణనలు నేను మర్చిపోలేకపోతున్నాను నిన్ను చూస్తుంటే. వాటన్నిటికీ నువ్వు అద్దం పడుతున్నట్లే ఉంది. పిడికెడు నడుము.. వెయ్యి కాండిల్ బల్బుల్లా వెలిగే కళ్ళు. నల్లత్రాచులాంటి జడ. నాట్యమయూరిలా నడక...''

''ముందు మీరు బయటకు వెళతారా...నన్నే నెట్టి తలుపేయమంటారా?'' తెచ్చి పెట్టుకున్న కోపంతో అని వడివడిగా ఆ గదిలోనుంచి పిల్లల గదిలోకి వెళ్లిపోయింది సుశీల.

చక్రధరం హుషారుగా లోపలకు వెళుతున్న భార్య వంకే చూస్తూ బయటకు వచ్చి గేటుదాటి గుడ్డి లైట్ల వెలుగులో రోడ్డు మీద కాలుపెట్టాడు.

''హమ్మయ్య! పేచీలు పెట్టి బుర్ర తినేయకుండా, దాన్ని ఉబ్బించి బయటపడడానికి నానా కూతలూ కూయాల్సి వచ్చింది. ఏదైనా శాంతియుతంగా విజయం సాధించాలీ అంటే ఇలాంటి గిమ్మిక్కులు చేయకతప్పదు. ఇప్పుడు సెంటర్‌కు వెళితేనేగాని తాజా మల్లెపూల దండలు దొరకవ్. ఆ పంకజం కొప్పుగా ముడుచుకున్న బారెడు జుట్టుకూ పదిమూరల ఘుమఘుమలాడే మల్లెలు చుడితేనేగాని దానికి మూడ్ వచ్చి చావదు' అనుకుంటూ వచ్చి ఆ వీధి మూలమీద ఉన్న రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు చక్రధరం-పంకజం సాంగత్యంలో ఆ రాత్రి పొందబోయే ఆనందాన్ని తన్మయంగా తలుచుకుంటూ.

★

